సాక్షి విజయనగరం

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



'కౌలు'కుంటున్న రైతులు

కౌలు రైతులకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సాధారణ రైతుల మాదిరిగా వారికి కూడా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. - 8లో



ఇళ్లు సిద్ధం చేయాలి..

జగనన్న కాలనీల్లో సామూహిక గృహప్రవేశానికి ఇళ్లను సిద్ధం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. - 8లో



ఆగిన లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

నక్కపల్లి సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో 14 మంది గాయపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

ఐదు రోజులపాటు తేలిక పాటి వర్షాలు



కురుపాం: రానున్న ఐదు రోజుల పాటు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని కురుపాం మండలం రస్తా కుంటుబాయి కృషి విజ్ఞానకేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త కె.ప్రశాంత్ మంగళవారం తెలిపారు. గాలి గంటకు 7–8 కి.మీ. వేగంతో దక్షిణవైపు వీచే అవకాశం ఉందన్నారు. 6, 7వ తేదీల్లో 10 మిల్లీమీటర్లు, 8న 12 మి.మీ., 9, 10వ తేదీల్లో 6 మి.మీల వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

8న పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: పారామెడికల్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 8న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

12న స్థాయీ సంఘ సమావేశాలు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 12న నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి వరుసగా 1 నుంచి 7వ స్థాయి సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు.

డీఆర్వోగా అనిత



ఎస్.డి.అనిత

విజయనగరం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ)గా పనిచేస్తున్న ఎం.గణపతిరావుకు శ్రీకాకుళం జిల్లా డీఆర్ఓగా బదిలీ అయింది. పరిశ్రమలు అండ్ కామర్స్ శాఖ ఆధ్వర్యంలోని ఏపీఐఐసీ సంస్థ విశాఖ జోన్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.డి. అనిత విజయనగరం జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీపై రానున్నారు. జిల్లాలో వివిధ కేడర్‌లో విధులు నిర్వహించిన అనుభవం అనితకు ఉంది. బదిలీ అయిన గణపతిరావు జిల్లాలో మూడేళ్లపాటు డీఆర్వోగా, పదేళ్లపాటు వివిధ కేడర్ పోస్టుల్లో పనిచేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం డీఆర్వోగా ఎం.రాజేశ్వరి సెలవుపై వెళ్లడంతో ఆ ఖాళీలో గణపతిరావును బదిలీపై పంపుతూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

8న జాబ్ మేళా

విజయనగరం అర్బన్: స్థానిక బీసీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఈ నెల 8న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లోని ఎస్‌బీఐ కార్డ్స్, యూనియన్ బ్యాంక్ కార్డ్స్ సంస్థలు వివిధ కేడర్‌లలో 100 పోస్టులకు ఇంటర్/డిగ్రీ విద్యార్హతగల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. డెక్కన్ కెమికల్ సంస్థలో 150 ఉద్యోగాలకు బీఎస్సీ (కెమిస్ట్రీ) విద్యార్హతగల పురుష అభ్యర్థులు, అరబిందో ఫార్మా యూనిట్‌లో 20 ప్రొడక్షన్ హెల్పర్ పోస్టులకు పదోతరగతి పాస్/ఫెయిల్ అయిన పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు 'ఎన్‌సీఎస్.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకొని బయోడేటా, రెండు పాస్‌ఫొటోలు, విద్యార్హత పత్రాలతో బీసీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐకు ఆ రోజు హాజరుకావాలని సూచించారు.

ఉపాధి కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ

- 16వ తేదీలోగా దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వసతి గృహంలో నిరుద్యోగ యువతకు ఉపాధికల్పించే పలు కోర్సులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సంస్థ మేనేజర్ జీ.వి.బి.రమణ తెలిపారు. నిరుద్యోగ గ్రామీణ పురుషులకు సెల్‌ఫోన్ రిపేరింగ్, టూ వీలర్ మెకానిక్ అండ్ ఏసీ రిపేర్ కోర్సులపై శిక్షణ ఉంటుందన్నారు. వసతి, భోజన సదుపాయాలు ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెలుపుకార్డుదారులు, 45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సెల్: 99595 21662, 99857 87820 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గురువుల చేతిలోనే.. విద్యార్థుల భవిత



- వైభవంగా గురుపూజోత్సవం
- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- ప్రభుత్వ కృషిని అందిపుచ్చుకోవాలి
- కలెక్టర్ నాగలక్ష్మి
- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘనంగా సత్కారం

విజయనగరం అర్బన్: విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. విద్యార్థులు ప్రయోజకులయ్యేలా విద్యాబుద్ధులు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం గురుపూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల వద్ద కంటే ఉపాధ్యాయుల సంరక్షణలోనే అధిక సమయం ఉంటారన్నారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించాలని సూచించారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సమాజానికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను గుర్తించి టీచర్స్ డే సందర్భంగా ఏటా ప్రభుత్వం అవార్డులతో సత్కరిస్తోందన్నారు. అవార్డు గ్రహీతలను అభినందించారు.

విద్యారంగానికి పెద్దపీట

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. నాలుగేళ్లగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మ ఒడి, వసతిత దీవెన, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెన, జగనన్న గోరుమద్ద వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. పేదకుటుంబాలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలకు నాడు–నేడు నిధులతో ఆధునిక సొబగులు అద్దుతోందన్నారు. విద్యార్థులు చదువుకునేందుకు అనువుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులకు ఆంగ్లభాషలో బోధన, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, బాలికల గురుకుల పాఠశాలలను ఇంటర్మీడియట్ వరకు స్థాయిపెంచడం వంటివి విద్యారంగ అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ప్రభుత్వ కృషిని సద్వినియోగం చేసుకుంటూ, విద్యార్థుల జీవితాలను సమున్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ కేటగిరీలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 71 మందిని దుశ్శాలువలతో సత్కరించి ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేశారు. డీఈఓ బి. లింగేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయనగరం మేయర్ విజయలక్ష్మి, డీఆర్వో ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుపతినాయుడు, డిప్యూటీ ఈఓలు బ్రహ్మాజీ, వాసుదేవరావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

గురుపూజోత్సవం సందర్భంగా వేణుగోపాలపురం డైట్ కళాశాల విద్యార్థినులు, చీపురుపల్లి బాలభవన్ విద్యార్థినులు నృత్యప్రదర్శనలతో అలరించారు. గురువులకు పాదాభివందనం చేస్తూ.. గురువుల గొప్పతనాన్ని వివరిస్తూ వివిధ కళారూప ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.





చిన్నారుల సాంస్కృతిక నృత్యప్రదర్శనలు



కలెక్టర్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

సైనిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి పాఠశాల ఆవరణలో డాక్టర్ సర్వేపల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో గతేడాది 10, 12 తరగతుల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. 2022–23 విద్యా సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన మానస రంజన్ సృష్టిని సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ ఎస్.కేశవన్, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







సామూహిక సత్కారాలు అందుకున్న జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు



















ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం



మొయిదలో శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- మొయిదలో ఇంటింటా తాగునీటి కుళాయి పనులకు శంకుస్థాపన

నెల్లిమర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.46 లక్షల ఖర్చుతో మొయిద గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఇంటింటా తాగునీటి కుళాయి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. గ్రామాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి సీసీ రహదారులు, కాలువలు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పరిపాలన కొనసాగుతోందని, సంక్షేమంలోనూ నిస్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఎంపీడీఓ గిరిబాల, పీఏసీఎస్ ప్రతినిధి అట్టాడ కనకారావు, సర్పంచ్ కృష్ణ పాల్గొన్నారు.

సర్వేపల్లి స్ఫూర్తితో సాగుదాం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

నెల్లిమర్ల: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ స్ఫూర్తితో విద్యార్థులందరూ మహోజ్వల భవిష్యత్తును పొందాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆకాంక్షించారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ నైపుణ్యత కలిగి ఉండాలని, తద్వారా భవిష్యత్తులో ఉన్నతస్థితికి చేరగలమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారి టి.చంద్రశేఖర్, కె.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

ఘనంగా జెడ్పీ చైర్మన్ జన్మదిన వేడుకలు



విజయనగరంలోని తన నివాసంలో కేక్ కట్‌చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో పలు సేవాకార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలుచోట్ల, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేశారు. పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. దుప్పట్లు, పండ్లు, గొడుగులు పంపిణీ చేశారు. అన్నదానం, రక్తదానం చేశారు. తన జన్మదినం సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో కలిసి ప్రఖ్యాతిగాంచిన మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగ ఆలయానికి ఆదివారం వెళ్లారు. మంగళవారం అక్కడే జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం రాత్రి విజయనగరం తిరిగి చేరుకున్నారు. ఆయనకు అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, జెడ్పీ అధికారులు, ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. వారి సమక్షంలో తన నివాసం వద్ద జెడ్పీ చైర్మన్ కేక్ కట్ చేశారు.

కొలతల ప్రకారమే రంగులు

- మనబడి నాడు–నేడు భవనాలకు కొలతల ప్రకారం రంగుల కేటాయింపు
- గతంలో పక్కదారి పట్టాయన్న ఆరోపణలపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- సచివాలయ ఇంజినీరు, హెచ్‌ఎంలతో రంగుల కంపెనీ ప్రతినిధి సమక్షంలో కొలతలు
- దీనికోసం కొత్తగా ఎస్‌టీపీ యాప్



రంగులు అద్దుకున్న బాడంగి హైస్కూల్ భవనం

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు–నేడు పనులకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వ విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. పనులను పారదర్శకంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రంగులను కొలతల ప్రకారం కేటాయించాలని తాజాగా నిర్ణయించింది. మొదటి విడత పనుల్లో కొత్త భవనాలకు రంగులు వేసినప్పుడు లెక్కలు లేకపోవడంతో రంగులు మిగిలిపోయేవి. ఆ రంగులు ఆయా ప్రాంతాల్లో దుర్వినియోగమయ్యేవి. దీనిని గుర్తించిన ప్రభుత్వం కొత్తగా రంగులు వేయనున్న బడుల్లో స్థానిక హెచ్‌ఎం, సచివాలయ ఇంజినీరు, రంగులు సరఫరా చేసే కంపెనీ ప్రతినిధి కొలతలు వేసి నివేదించాలి. అనంతరం ఆయా వివరాలను ఇంజినీరింగ్ అధికారులు ఎస్‌టీపీ యాప్‌తో అనుసంధానం చేసి భవనాల కొలతలు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదించాక మాత్రమే రంగులు విడుదలవుతాయి.

జోరుగా పనులు..

జిల్లాలో మనబడి నాడు–నేడు రెండో ఫేజ్ పనులు జోరందుకున్నాయి. పనులు పూర్తయిన చోట రంగుల కోసం కొలతల ప్రకారం ఏ మేరకు అవసరమన్నది ఎస్‌టీపీ యాప్‌లో నమోదుచేసిన వెంటనే ప్రభుత్వం సరఫరా చేస్తుంది. దీనివల్ల రంగుల వినియోగం వృథాకాదు. పక్కదారి పట్టే అవకాశం ఉండదు.

– వి.వేణుగోపాల్, డీఈఈ, మన బడి నాడు–నేడు

రూ.232.08 కోట్లతో రెండో విడత భవనాల నిర్మాణం...

మనబడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 739 పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే రూ.99.26 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. మరో నెలరోజుల్లో మిగతా పనులు చేసి కిటికీలు, తలుపుల వంటి ఫర్నీచర్‌తో పాటు రంగులు కూడా వేసి భవనాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అప్పగిస్తారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



జె.బి.ధనుంజయ రాజు, హెడ్‌మాస్టర్, జెడ్పీహెచ్ ఎస్, వెలగవలస, తెర్లాం



ఎన్.తిరుపతి, హెచ్‌ఎం, ఆర్‌ఆర్‌బీ పురం, జియ్యమ్మవలస



బి.ఉమామహేశ్వరి, స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్, ఆర్.ఆమదాలవలస



పి.సరోజిని దేవి, కాంట్రాక్టు టీచర్, కేజీబీవీ జోగింపేట, సీతానగరం



జె.పైడిరాజు, ఎస్‌జీటీ, ఎంపీపీఎస్, పెదబంటుపల్లి, గుర్ల



అదపాక దామోదరరావు, స్కూల్ అసిస్టెంట్, బొద్దూరు జెడ్పీహెచ్‌ఎస్, సంతకవిటి

విశాఖపట్నంలోని ఆంధ్రాయూనివర్సిటీ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం అట్టహాసంగా సాగింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా అధికారుల చేతుల మీదుగా అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. అవార్డులు పొందిన ఉమ్మడి విజయనగరం జిల్లా ఉపాధ్యాయులను చిత్రంలో చూడొచ్చు.

– సాక్షినెట్‌వర్క్

క్లుప్తంగా

లారీని ఆటో ఢీకొని ఒకరి మృతి


పాపయ్య మృతదేహం

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లి-చందకపేట గ్రామాల మధ్యలో జాతీయ రహదారి26పై మంగళవారం వేకువ జామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో ప్రమాదంలో ఆటో ప్రయాణికుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం పెదకాద గ్రామానికి చెందిన బొద్దాన పాపయ్య(73)తో పాటు బొద్దాన రాము ఆటో డ్రైవర్ బొద్దాన సురేష్‌లు కాయగూరలు విక్రయించేందుకు విజయనగరం వెళ్తుండగా బొండపల్లి-చందక పేట గ్రామాల మధ్యలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాపయ్యను విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి 108లో తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అలాగే బొద్దాన రాము పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

కురుపాం: ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రేమకు ప్రతిరూపంగా ఇద్దరు పిల్లలను కన్నారు. ఇలా సంతోషంగా ఉండగానే ఇటీవల వారి మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. ఎప్పటిలాగానే కోపంతో ఉన్న ఇద్దరూ మాటకు మాట అనుకున్నారు. ఇంతలోనే వివాహిత క్షణికావేశంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ విషాద సంఘటనపై ఎల్విన్‌పేట్ సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్సై సీహెచ్. ప్రసాదరావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. పూతికవలస ఎస్సీ కాలనీకి చెందిన మండంగి దుర్గాప్రసాదరావు శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలానికి చెందిన ఎం.సంధ్య (24)ను ప్రేమించి వివాహం చేసుకున్నాడు ఇద్దరి మధ్య గొడవల కారణంగా సంధ్య ఇంట్లో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే కురుపాం ఎస్సై, ఎల్విన్‌పేట సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్వతీపురం అసెంబ్లీ ఓట్లపై విచారణ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నియోజకవర్గంలో గల 1,87,751 ఓట్లపై విచారణ చేసినట్లు రెవెన్యూ డివిజన్ అధికారి, పార్వతీపురం నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి కె.హేమలత అన్నారు. ఓటరు పునశ్చరణపై మంగళవారం పార్వతీపురం నియోజకవర్గం స్థాయిలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,87,751ఓట్లు ఉన్నాయని, సీతానగరం మండలం నిడగల్లులో మృతిచెందిన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయని ప్రజాప్రతినిధులు తెలపగా తక్షణమే ఆమె స్పందించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశం అనంతరం నిడగల్లు గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. నియోజకవర్గంలో గడిచిన వారం రోజుల్లో ఫారం 6కింద 149, ఫారం -7కింద 149, ఫారం -8కింద 125 దరఖాస్తులు అందాయని తెలిపారు. తొలగిస్తున్న ప్రతి ఓటును నిశితంగా పరిశీలించనున్నట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు పరిశీలన

సీతానగరం: మండలంలోని గుచ్చిమి, నిడగల్లు గ్రామ పంచాయతీల్లో ఓటరు తొలగింపు ప్రక్రియను ఆర్డీఓ హేమలత మంగళవారం పరిశీలించారు. గుచ్చిమిలో 108, 109 పోలింగ్ కేంద్రాల్లో 58 ఓట్ల తొలగింపు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే నిడగల్లులో 115, 116, 117 పోలింగ్ కేంద్రాల పరిధిలో 82ఓట్లు తొలగించగా 116,117 పోలింగ్ కేంద్రాల్లో ఇంకా డెత్‌లు ఉన్నాయని, వాటిని తొలగించాలని ఆదేశించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹148	₹268	₹ 276

'కౌలు'కుంటున్న రైతులు

- అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- రుణాలు, రైతుభరోసా వర్తింపు


పొలానికి నీరు తోడు కౌలు రైతు

విజయనగరం ఫోర్ట్: కౌలు రైతులకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సాధారణ రైతుల మాదిరిగా వారికి కూడా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. సాగు పెట్టుబడికి ఆర్థిక సాయంతో పాటు పండించిన పంటను కొనుగోలు చేస్తోంది. ముఖ్యంగా కౌలు రైతులకు పంట రుణాలను ఇప్పించి పెట్టుబడికి ఇబ్బందులు పడకుండా ఆదుకుంటోంది. ఏటా కౌలు రైతుల సంఖ్యతో పాటు అందించే ఆర్థిక సాయాన్ని పెంచుతోంది. ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవడంతో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రైతు భరోసా కింద రూ.1.95 కోట్లు అందజేత

ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని సాధారణ రైతుల మాదిరి కౌలు రైతులకు అందిస్తూ ఏటా ప్రతి కౌలు రైతుకు రూ.7500 చొప్పన విడుదల చేస్తోంది. గత ఏడాది 2111 మందికి రూ.1.58 కోట్లు అందజేయగా ఈ ఏడాది 2603 మందికి రూ.1.95 కోట్లు అందజేసింది.

భూయాజమానులకు ఇబ్బంది లేకుండా

భూయాజమానుల దగ్గర భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న నిరుపేద రైతులకు దేశంలో ఎక్కడా లేనివిధంగా పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్‌సీ) ఇచ్చి అండగా నిలిచింది. సాధారణ రైతుల మాదిరి వారికి కూడా పంట రుణాలను ప్రభుత్వం అందిస్తోంది. ఈ క్రమంలో ఈఏడాది 299 మంది రైతులకు ఇప్పటి వరకు రూ.85.05 లక్షల పంటరుణాలు ఇచ్చింది.

సాగు ధ్రువీకరణ పత్రాలతో ప్రయోజనాలు

పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాల (సీసీఆర్‌సీ) వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు పొందవచ్చు. అలాగే పండించిన పంటను విక్రయించుకోవచ్చు. ముఖ్యంగా రైతు భరోసా ఆర్థిక సాయం పొందవచ్చు.

మూడేళ్లుగా వస్తున్న రైతు భరోసా



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని భూమిని సాగుచేస్తున్నాను. 2021 నుంచి కౌలు చేస్తున్నాను. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మూడేళ్లుగా రైతు భరోసాను ఇస్తోంది. కౌలు రైతులకు మేలు చేస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని జీవితాంతం గుర్తుంచుకుంటాం.
– మాసాద ప్రసాద్, కౌలు రైతు, పినవేమలిగ్రామం

ఈ ఏడాది ఎక్కువగా సాగు హక్కు పత్రాలు



పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు గత ఏడాది కంటే ఈఏడాది అధికంగా ఇచ్చాం. రైతు భరోసా కూడా ఎక్కువ మందికి ప్రభుత్వం వర్తింపజేసింది. కౌలు రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తోంది.
– వి. తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

పైడితల్లికి ప్రత్యేక అలంకరణ


చదురుగుడిలో పుష్పాలంకరణలో అమ్మవారు


వనంగుడిలో గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు చదురుగుడిలో మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వనంగుడిలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. చదురుగుడి ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన బూరెలతో నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు,కుంకుమలు చెల్లించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మడ్డువలసకు జలకళ


జలకళతో మడ్డువలస ప్రాజెక్టు

- ప్రాజెక్టులోకి చేరుతున్న నీరు
- ఆనందంలో రైతులు


ప్రాజెక్టు వద్ద 63.50 మీటర్ల లెవెల్ నమోదైన దృశ్యం

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు ఇప్పుడిప్పుడే నీటితో జలకళ సంతరించుకుంటోంది. ప్రాజెక్టు వద్ద గేట్లు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.1.80 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ఈ ఏడాది మార్చిలో ప్రాజెక్టులో నీటిని ఖాళీ చేశారు. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్‌స్టోరేజీ(58.02 మీటర్లు లెవెల్)కి చేరుకుంది. జూలై చివరి నాటికి ప్రాజెక్టు వద్ద పనులు పూర్తి చేయడంతో ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. జూలై చివరి నాటికి 59 మీటర్ల నీటినమట్టం నమోదైంది. అప్పటి నుంచి ప్రాజెక్టు ఎగువన ఉన్న సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి స్వల్పంగా నీటి ప్రవాహం పెరగడంతో ఇప్పుడు వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 63.50 మీటర్ల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టు మొత్తం నీటిమట్టం 65 మీటర్లు లెవెల్ కాగా 3.33 టీఎంసీల నీటి నిల్వ ఉండాల్సి ఉంది. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురుస్తుండడంతో ప్రాజెక్టు నిండడానికి చాలా సమయం పట్టింది. ఆశాజనకంగా వర్షాలు కురిస్తే మరో పదిహేను రోజుల్లో నదుల్లో ఇన్‌ఫ్లో పెరిగి ప్రాజెక్టు నిండుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం ప్రాజెక్టులో 1.77 టీఎంసీ నీరు నిల్వ ఉండడంతో ఆయకట్టు భూముల్లో పంటలు సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సామూహిక గృహప్రవేశానికి ఇళ్లు సిద్ధం చేయాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు


జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

బొబ్బిలి: మరో వారం రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించే జగనన్న కాలనీల సామూహిక గృహప్రవేశానికి ఇళ్లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆమె పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద ఉన్న జగనన్న కాలనీని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారికి ఏమేం అవసరాలున్నాయో అడిగి తెలుసుకున్నారు. అక్కడి కాలనీ ఆర్చ్ నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీలోని రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు ఉండాలన్నారు. అలాగే తాగునీటి కోసం తీసుకున్న చర్యలపై ఆరా తీశారు.

ఓటరు జాబితా సరిచేయండి

పాత బొబ్బిలిలో ఇంటింటి సర్వేను తనిఖీ చేసిన కలెక్టర్ నాగలక్ష్మి ఇటీవల పాత బొబ్బిలిలో ఇటీవల చేపట్టిన ఓటరు జాబితా సవరణను తనిఖీ చేశారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓటరు జాబితాలోని తప్పొప్పులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళ అరుణ ఫొటో బదులు వేరే వ్యక్తి ఫొటో వచ్చిందని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే పలు ఇళ్లకు వెళ్లి ఓటరు జాబితాలోని అడ్రసులు, పేర్లను పరిశీలించారు. ఆర్డీఓ పి.శేషశైలజ, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ డోల రాజేశ్వర రావు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పీలుస్తున్న ముగ్గురి అరెస్టు

విజయనగరం క్రైమ్: గంజాయి పీలుస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు మంగళవారం తెలిపారు. స్థానిక కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ వద్ద గంజాయి పీలుస్తూ పట్టుబడిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేత్రదానంపై అవగాహన కల్పించాలి

రాజాం సిటీ: నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యులు బి.నరేంద్ర, సిద్ధేశ్వరి అన్నారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా బొద్దాం పీహెచ్‌సీలో నేత్రదానంపై మంగళవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాలను పారద్రోలాలని, మరణానంతరం ప్రతిఒక్కరూ నేత్రదానం చేసేలా చైతన్యం తీసుకురావాలన్నారు.

ఆగిన లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- ఒకరి మృతి,
- 14 మందికి గాయాలు
- ఆరు నెలల చిన్నారి పరిస్థితి విషమం


బస్సులో ఇరుక్కుని మరణించిన రమేష్


తలకు బలమైన గాయాలైన ఆరు నెలల చిన్నారి మోక్షిత్


మృతుడు రమేష్ (ఫైల్)


ఆస్పత్రిలో క్షతగాత్రులు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): జాతీయరహదారిపై నక్కపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో 14 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. డ్రైవర్ మితిమీరిన వేగంతో బస్సును నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్వతీపురం నుంచి గుంటూరు వెళ్తున్న సాయికృష్ణ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు సుమారు 40 మంది ప్రయాణిస్తున్నారు. వారంతా పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లిలలో బస్సు ఎక్కారు. బస్సు అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో నక్కపల్లి దాటిన తర్వాత కిలోమీటరు దూరంలో మనబానవానిపాలెం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. అనకాపల్లిలో జరిగిన వివాహానికి హాజరై తిరిగి వెళ్తున్న విజయవాడ సమీపంలో గొల్లపూడి గ్రామానికి చెందిన బైపాన రమేష్ (35) బస్సులోనే చిక్కుకుని ఈ ప్రమాదంలో మరణించారు. ఇదే ప్రమాదంలో ఆయన భార్య బైపాన కుమారి, కుమారుడు మోక్షిత్ (ఆరు నెలలు)తోపాటు 14మంది గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్వల్ప గాయాలైన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం వారి ప్రాంతాలకు పంపించారు. ఆరు నెలల మోక్షిత్ తలకు బలమైన గాయాలై పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. సంఘటన స్థలాన్ని నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, నక్కపల్లి సీఐ అప్పన్న పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి వివరాలు సేకరించారు. మృతుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు

గొర్ల బలరామం (దేవరపల్లి, బొబ్బిలి), ఎ.గణేష్‌కుమార్ (పార్వతీపురం), ఎస్.వెంకటవరప్రసాద్ (బొబ్బిలి), చిలకంట నరేంద్ర (బెంగళూరు), చంద్ర (బెంగళూరు), అల్లు శాంతారాం (పార్వతీపురం), గొల్ల శిరీష (పార్వతీపురం), ముప్పాల వర్షిత (బొబ్బిలి), మున్నం దేముడమ్మ (పెందుర్తి), ఆకోటి ధరణి (సాలూరు) అల్లు సావిత్రిమ్మ (పార్వతీపురం), పి.కోటేశ్వరమ్మ (పార్వతీపురం)

8న పోలమాంబ సన్నిధిలో సామూహిక కుంకుమ పూజ

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఈ నెల 8న సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. నాల్గవ శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని, వేదపండితుల మంత్రోచ్ఛరణలతో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నామన్నారు. కుంకుమ పూజలో పాల్గొనే భక్తులకు దేవదాయ శాఖ తరఫున పసుపు, కుంకుమ, గాజులు అందివ్వనున్నట్లు తెలిపారు.

లైంగికదాడి నిందితుడి అరెస్టు

రాజాం సిటీ: మండల పరిధి గెడ్డవలస గ్రామంలో మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు బూరాడ వెంకటరావును అరెస్టు చేశామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. మంగళవారం అరెస్టు చేసిన నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

ఉపాధ్యాయులు దేశానికి వెన్నెముక

- వీసీ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టి మణిని సత్కరిస్తున్న యూనివర్శిటీ సిబ్బంది


సీతం ఇంజనీరింగ్ కళాశాలలో సత్కారం పొందుతున్న సెంచూరియన్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజు


సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాలు అర్పిస్తున్న జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధికి ఉపాధ్యాయులు కీలక పాత్రవహిస్తున్నారని దేశానికి వారు వెన్నెముక లాంటి వారని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి అన్నారు. ఈ మేరకు స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయులకే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి అని, అటువంటి మహనీయుని అడుగుజాడలలో నేటి ఉపాధ్యాయులు నడవాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీ అధ్యాపక బృందం వీసీని ఘనంగా సత్కరించింది. యూనివర్సిటీ డీన్స్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ తంత్రవాహి, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఏఎస్.బీ.కివడే తదితరులు ఉపాధ్యాయ వృత్తి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో

నగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు మంచి సమాజాన్ని తయారు చేసే గొప్ప సాధనమని అన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది కార్యోన్ముఖుల్ని చేసే గొప్ప శక్తి టీచర్ అని కొనియాడారు. అనంతరం పలువురు అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్, యూనివర్సిటీ డైరెక్టర్లు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో..

స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెంచూరియన్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే తోటపాలెంలోని సత్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది.